క్లుప్తంగా

యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్



తీరంలో కాపాడిన యువకులతో లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు

ఏయూ క్యాంపస్: సాగర తీరంలో సముద్ర స్నానం చేయడానికి వచ్చి మునిగిపోతున్న ఇద్దరు యువకులను లైఫ్‌గార్డ్‌లు, మెరైన్ పోలీసులు రక్షించారు. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు విశాఖ పర్యటనకు వచ్చారు. ఆదివారం సాయంత్రం ఆర్‌కే బీచ్ వద్ద స్నానం చేస్తుండగా వారిలో ఇంజమామల్ హక్, నయీమ్‌లు కెరటాల ధాటికి సముద్రంలోకి వెళ్లిపోయారు వెంటనే అక్కడే విధుల్లో ఉన్న మెరైన్ పోలీసులు స్పందించి జీవీఎంసీ లైఫ్ గార్డులను అప్రమత్తం చేశారు. వెంటనే వారు మునిగిపోతున్న ఇద్దరు యువకులను రక్షించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి అక్కడి నుంచి పంపించేశారు,

ఎంవీపీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని ఓ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలమనాలజిస్ట్ డాక్టర్ కేత ఫణిందర్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది వ్యాధిగ్రస్తులకు డాక్టర్లు ప్రాణదాతలుగా నిలుస్తున్నారన్నారు. డాక్టర్ ఫణిందర్ ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాల ద్వారా సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బుగత సత్యనారాయణ, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో ధనలక్ష్మి అమ్మవారు



కరెన్సీ నోట్లతో అలంకరించిన ధనలక్ష్మి అమ్మవారు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో ఆదివారం ధనత్రయోదశిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీ ధనలక్ష్మి అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ జరిపి నాణాలు, పసుపు కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించారు. లక్ష్మీ హోమం, సామూహిక పారాయణలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు.

వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో స్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తరపూజ జరిపారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు.

22న గోవర్ధన పూజ

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద హరేకృష్ణ మూమ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దామోదర దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22 సాయంత్రం 6 గంటలకు గోవర్ధన పూజ నిర్వహించనున్నట్టు యదురాజ దాస తెలిపారు. ఆదివారం ఆయన భక్తులతో మాట్లాడుతూ గోవర్ధన పూజ సందర్భంగా పిండి వంటలతో గోవర్ధన గిరి నమూనా తయారు చేయనున్నట్టు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శ్రీకృష్ణ భగవానుని కృప పొందాలని కోరారు. అలాగే దామోదర మాసం 13వ రోజు సందర్భంగా ఆదివారం భక్తులు నెయ్యి దీపాలను శ్రీకృష్ణునికి ఇష్టమైన దామోదర అష్టకం పాడుతూ హారతిగా అందించారు. ఈ కార్యక్రమాలను అంబరీష దాస పర్యవేక్షించారు.

కార్తీకమాస పూజలకు ఏర్పాట్లు



కార్తీకమాస పూజలకు అలంకరించిన కొత్తవెంకోజీపాలెం శివాలయం



ధ్వజస్తంభం వద్ద దీపారాధనకు ఏర్పాట్లు

సర్వాంగ సుందరంగా శివాలయాలు

మద్దిలపాలెం: కార్తీక మాస పూజలకు శివాలయాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఆలయాలన్నీ నూతన రంగులు, హంగులతో ఆకట్టుకుంటున్నాయి. దేవస్థానం, కమిటీల నిర్వహణలోని శివాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ రామానంద ఆశ్రమం, శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వర ఆలయంలో ఈ నెల 22 నుంచి నవంబరు 21 వరకు కార్తీకమాస పూజలు నిర్వహించనున్నట్టు కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. 22న ఉదయం 10 గంటలకు మంగళధ్వనితో ప్రారంభమై అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ, పంచామృత అభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు ఆకాశ జ్యోతి ప్రజ్వలన ప్రారంభిస్తామని తెలిపారు. నెల రోజులపాటు ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ఎ.రామకృష్ణ, పి.సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి, పి.బాల భాస్కరశర్మ,



కార్తీక దీపాలు వదిలేందుకు సిద్ధం చేసిన కొలను

ప్రభాకరశర్మ, వి.లక్ష్మీనారాయణశర్మ, సంతోష్‌శర్మ బృందం ఆలయ సముదాయంలోని శివాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వినాయక, రాజరాజేశ్వరి, ఆంజనేయస్వామి, అయ్యప్ప దేవాలయంలో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారని తెలిపారు. 25న నాగుల చవితి వేడుకలు ఆలయం వద్ద ఉన్న పుట్టలో పూజలు, 26న నాగపంచమి పూజలను సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో జరుపుతామన్నారు. 27న మొదటి సోమవారం స్వామికి ప్రాతఃకాలం నుంచి అభిషేకార్చనలు నిర్వహిస్తామని తెలిపారు. అదే రోజు 11 గంటలకు రుద్రాభిషేకాలు కూడా నిర్వహిస్తారన్నారు. నవంబరు 1న శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక శుద్ధ ఏకాదశి రోజున పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు జరుపుతామని పేర్కొన్నారు. 2న కార్తీక శుద్ధ ద్వాదశి (చిల్కుల ద్వాదశి) క్షీరాబ్ధి ద్వాదశి, 5న కార్తీక పౌర్ణమి పూజలు, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జ్వాలా తోరణం వెలిగించుట, 16న గౌరీ వ్రతాలు, 18న మాస శివరాత్రి పూజలు జరుపుతామన్నారు. అదే రోజు అన్నసమారాధన, 20న కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు, 21న పోలి పాడ్యమిని పురస్కరించుకుని భక్తులు దీపాలు వదిలేందుకు వీలుగా కొలనులో తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్తీక మాస పూజలకు స్థానిక గ్రామ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా హెచ్‌బీ కాలనీ, కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట శివాలయాల్లోనూ, ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సాధ్యమైతే తోటివారికి సాయం చేయాలి

ఎంవీపీ కాలనీ: సాటి మనిషి అవసరాన్ని గుర్తించి సాధ్యమైనంత మేర సాయం చేసే తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని విశాఖ నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి ప్రేమ సదన్‌లో ఆదివారం నిర్వహించిన ‘యువ వికాస్’ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా విశాఖ జిల్లా సత్యసాయి సేవా సంస్థల యూత్ వింగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ బాగ్చి మాట్లాడుతూ ప్రేమ, సేవా గుణానికి శ్రీ సత్యసాయి బాబా ప్రతీకగా నిలిచారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజలంతా మంచి పనులు, సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అవసరం, ఆపదలో ఉన్నవారికి సాయం అందిస్తే తిరిగి మనల్ని అదే రక్షిస్తుందన్నారు. అనంతరం సీపీని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీని సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

శ్రీకృష్ణాపురం విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఆరిలోవ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ఆదివారం స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో శ్రీకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ రత్నవల్లి తెలిపారు. 19 ఏళ్లలోపు కేటగిరీలో హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలు బాలుర, బాలికల విభాగానికి విశాఖ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలో కళాశాలకు చెందిన అభిలాష్, చిన్నబాబు, రాహుల్, వరప్రసాద్ హ్యాండ్‌బాల్, మనోజ్, అశోక్ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జట్టుకు హేమంత్ ఎంపికైనట్టు తెలిపారు. వచ్చే నెల కడప, గుంటూరు జిల్లాల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వీరంతా ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రత్నవల్లి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ విద్యాసాగర్, పీఈటీ వివేక్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సిబ్బంది, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల సమన్వయకర్త గ్రేస్ అభినందించారు.

ఏయూలో ప్రకృతి పంటల సంత విజయవంతం

మద్దిలపాలెం: ఏయూలోని ‘ఆ హబ్’ ప్రాంగణంలో భారత్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రకృతి ఆధారిత పంటల సంత విజయవంతమైంది. ఈ సందర్భంగా భారత్ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యుడు జలగం కుమారస్వామి మాట్లాడుతూ ఈ సంతకు విశేష స్పందన లభించిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రకృతి ఆధారిత పంటలనే ఆహారంగా తీసుకోవాలని కోరారు. ఈ ప్రకృతి ఆధారిత పంటల సంత ఇకపై ప్రతి ఆదివారం ఇదే వేదికపై క్రమం తప్పకుండా జరుగుతుందని వెల్లడించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వారాహి ఎఫ్‌పీవో సహకారంతో ఈ పంటలను నేరుగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ హబ్ సంస్థ ప్రతినిధి ఈశ్వరపు రవి, గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం ప్రతినిధులు పి.ఎల్.ఎన్.రాజు, దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, పాలెం నేచురల్స్ అశోక్, రిషి, వారాహి సంస్థ ప్రతినిధి గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి పంటల సంతలో భారత్ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యుడు జలగం కుమారస్వామి, తదితరులు

• మత్స్యకారుల మోముల్లో వెలుగు

సాగరంలో చేపల వేట మత్స్యకారులకు ఎప్పుడూ ఒక పోరాటమే. కానీ.. ఆదివారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో కనిపించిన దృశ్యం ఆ కష్టానికి తగిన ఫలితాన్ని కళ్లకు కట్టింది. నిత్యం సాగరంలో వేట చేసే మత్స్యకారులకు ఆదివారం పంట పండింది. వారి బోట్లు నిండుగా మత్స్య సంపదతో ఒడ్డుకు చేరాయి. దీంతో వారి మోముల్లో సంతోషం వెల్లివిరిసింది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం









కమనీయం.. శాంతి కల్యాణం



శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలకు శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

పద్మనాభం: స్థానిక కుంతీ మాధవ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న అనంత పద్మనాభస్వామి పవిత్రోత్సవాలు ఆదివారం శాంతి కల్యాణంతో ఘనంగా ముగిశాయి. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం వంటి పూజలు నిర్వహించారు. తదుపరి కుంతీ మాధవ స్వామి, శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి, రుక్మిణీ సత్య భామ సమేత వేణుగోపాల స్వామి, లక్ష్మీ దేవి విగ్రహాల నుంచి పవిత్రాలను విసర్జింప చేశారు. పూర్ణాహుతి అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలకు మంత్రోచ్చరణల నడుమ శాంతి కల్యాణం నిర్వహించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ దంపతులు తాలాడ పాప, పద్మనాభం, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలి దంపతులు కంటుబోతు లక్ష్మి, ఎర్నాయుడుతో పాటు అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు శాంతి కల్యాణాన్ని కనులారా వీక్షించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి

మద్దిలపాలెం: వైఎస్సార్ సీపీని నమ్ముకుని అకుంఠిత దీక్షతో పని చేసే ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. పదవులు పొందిన వారు వాటికి వన్నె తెచ్చేలా పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పార్టీ జిల్లా మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ నిజాముద్దీన్, జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా బుడుమూరి ఈశ్వరరావును నియమించారు. వీరిరువురు సీతమ్మధారలోని తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో మొల్లి అప్పారావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని మొల్లి అప్పారావు సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నమ్మకాన్ని ఎక్కడా వమ్ము చేయకుండా అందరినీ కలుపుకుని పనిచేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని కార్యకర్తలు, ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు చేపట్టే కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మైనారిటీ విభాగం 16వ వార్డు అధ్యక్షుడు మహమ్మద్ ఫిరోజ్ హుస్సేన్, 15వ వార్డు అధ్యక్షుడు మహమ్మద్ కరీం, అబ్దుల్ లతీఫ్, ఎం.డి.ఆలీ అబ్బాస్, షేక్ సుభానీ, వెంకటేశ్, మహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.



పదవులు పొందిన నాయకులతో మొల్లి అప్పారావు

కొనసాగిన ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల నిరసన

ఎంవీపీ కాలనీ: నెల వారీ జీతాలు రూ.26 వేలకు పెంచడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు, సిబ్బంది విధులు బహిష్కరించి చేపట్టిన నిరసన కార్యక్రమం రెండో రోజూ కొనసాగింది. వాల్తేర్ డిపో ఆవరణలో ఆదివారం సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ఆర్టీసీ హైయర్ బస్సుల డ్రైవర్ల సంఘం నాయకులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ రోజువారీగా డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై డిపో యాజమాన్యం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. గత కొన్నేళ్లుగా ఉద్యోగుల జీతాలు పెంచకుండా, సౌకర్యాలు కల్పించకుండా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.18 వేల జీతంతో కూడిన అగ్రిమెంట్ పూర్తయి ఏడాది గడిచినా జీతాలు పెంచలేదన్నారు. తక్షణమే రూ.26 వేలు నెల వారి జీతంగా ప్రకటించడంతోపాటు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం కార్యదర్శి జంపన్న మాట్లాడుతూ వాల్తేర్ డిపో పరిధిలో 80 మంది డ్రైవర్లు ఉండగా 29 అద్దె బస్సు సర్వీసులు నడుస్తున్నాయన్నారు. డ్రైవర్లకు జీతాలు పెంచాలని కోరుతూ గత 3 నెలలుగా డిపో అధికారులను కోరుతున్నట్లు తెలిపారు. అయినప్పటికీ అధికారులు మాత్రం అద్దె బస్సుల యజమానులతో కుమ్మక్కై డ్రైవర్లకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకుంటే నిరసనను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొన్నారు.



వాల్తేర్ డిపో ఎదుట నిరసనకు దిగిన అద్దె బస్సుల డ్రైవర్లు, సిబ్బంది

ఏఎస్ రాజా మైదానంలో అధిక ధరలకు విక్రయాలు

- అసోసియేషన్ అదనపు వసూళ్లతో వ్యాపారుల ఇష్టారాజ్యం
- పట్టించుకోని పోలీసులు, విజిలెన్స్ అధికారులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో బాణసంచా విక్రయాలు ఆదివారం జోరుగా సాగాయి. శుక్రవారం రాత్రి నుంచే చాలా మంది వ్యాపారాలు ఇక్కడ విక్రయాలు ప్రారంభించారు. ఈ ఏడాది 40 వరకు దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహిస్తున్నారు. గతంలోలా కాకుండా మైదానం చుట్టూ సర్కిల్ మాదిరిగా దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నారు. అయితే ఇక్కడ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, బాణసంచా ఉత్పత్తులను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. నగరంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ ధరలు అధికంగా ఉన్నట్లు పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు. ఇతర చోట్ల 30 ఐటమ్స్‌తో కూడిన ఫ్యామిలీ ప్యాక్స్ రూ.700 నుంచి రూ.800 దొరుకుతుంటే ఇక్కడి వ్యాపారులు మాత్రం రూ.1200కి పైగా వసూలు చేస్తున్నారు. ఇతర ఉత్పత్తుల విషయంలో విక్రయాలు ఇదేవిధంగా జరుగుతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. అయితే స్టాళ్ల ఏర్పాటు కోసం రూ.90 వేలు చెల్లించామని అందుకే అధిక ధరలకు విక్రయిస్తున్నామని కొందరు వ్యాపారులు బాహాటంగా చెబుతున్నట్లు వినియోగదారులు పేర్కొంటున్నారు. జీవీఎంసీకి చెల్లించేందుకు రూ.70 వేలు, నిర్వహణ ఖర్చులకు రూ.20 వేలు చొప్పున ఇక్కడి అసోసియేషన్ ప్రతినిధులు అదనపు వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. దీంతో ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడి ధరలు భారీగా ఉన్నట్లు వినియోగదారులు పేర్కొంటున్నారు. అయితే ఇంత జరుగుతున్నా అసోసియేషన్ అదనపు వసూళ్లను, అధిక ధరల విక్రయాలను నియంత్రించాల్సిన పోలీసులు, విజిలెన్స్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పార్కింగ్, భద్రత ఏర్పాట్లు మినహా ధరలపై కనీస పర్యవేక్షణ ఉంచడం లేదు. వ్యాపారులు విక్రయిస్తున్న ధరలపై కనీసం పర్యవేక్షణ లేకపోడంతో ధరలు అంతకంతకూ కొండెక్కుతున్నాయి. చివరి రోజున సోమవారం ఇక్కడ ధరలు మరింత ఆకాశాన్ని అంటే అవకాశం ఉందని వినియోగదారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ, పోలీసు, విజిలెన్స్ అధికారులు పరిశీలించి అధిక ధరల విక్రయాలను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు.



ఏఎస్ రాజా మైదానంలో బాణసంచా విక్రయిస్తున్న వ్యాపారులు

ఆగివున్న లారీని ఢీకొనడంతో ప్రమాదం

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక ఎస్‌ఐ సింహాచలం తెలిపిన వివరాలు.. హైవేపై చిన్నయ్యపాలెం వద్ద సర్వీస్ రోడ్డులోని టీ స్టాల్ ముందు ఆదివారం ఉదయం ఓ లారీ డ్రైవర్ తన లారీని నిలిపాడు. పెందుర్తి నుంచి సబ్బవరం వైపు వస్తున్న మరో లారీ ఆగివున్న ఈ లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో ఆ లారీ డ్రైవర్ వెంపల రవిచరణ్(25) రెండు కాళ్లు ఇరుక్కుపోయి, తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో పాటు సబ్బవరం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. 108 సిబ్బంది లారీ క్యాబిన్లో ఇరుక్కున్న రవిచరణ్‌కు సెలైన్ బాటిల్ ఎక్కించి, అత్యవసర వైద్య సేవలు అందించారు. రెండున్నర గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీసి, చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన డ్రైవర్ మూడు రోజులుగా వాహనాన్ని నడుపుతున్న నేపథ్యంలో నిద్రమత్తులో ఈ ఘటన జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్ రవి గాజువాక దరి జగ్గు జంక్షన్‌కు చెందినవాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సింహాచలం తెలిపారు.

హైదరాబాద్‌లో స్థానిక ప్రతిభకు పట్టం

నలుగురు కళాకారిణులకు ‘నాట్యమయూరి’ అవార్డులు



నృత్య ప్రదర్శన చేస్తున్న సంగివలసకు చెందిన రజనీరెడ్డి

తగరపువలస: హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియం.. స్థానిక నృత్య కళాకారిణుల ప్రతిభకు వేదికైంది. నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించిన నృత్య ప్రదర్శనల్లో తగరపువలస, సంగివలస ప్రాంతాలకు చెందిన నలుగురు కళాకారిణులు ప్రతిష్టాత్మక నాట్యమయూరి పురస్కారాలను కైవసం చేసుకున్నారు. తగరపువలసలోని నాట్యరవళి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీకి చెందిన లిఖిత సాయి, లక్ష్మీలహరి, గీతామాధురి తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వీరు కూచిపూడిలో జావళి, తరంగం, శబ్దం, అన్నమయ్య కీర్తనలతో పాటు కోయిరాలే, కోడిపందెం, కైకలూరి చిన్నదాన్ని వంటి జానపద నృత్య అంశాలను అద్భుతంగా ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శనకుగానూ అవార్డులు గెలుచుకున్నారు. గతంలో వీరు తిరుపతి, రాజమహేంద్రవరం వంటి జాతీయస్థాయి వేదికలపైనా సత్తా చాటడం గమనార్హం. అదే విధంగా జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని సంగివలసకు చెందిన శ్రీ నృత్యప్రియ అకాడమీ నిర్వాహకురాలు చేట్ల రజనీరెడ్డి సైతం ఇదే వేదికపై నాట్యమయూరి అవార్డును అందుకున్నారు. ఆమె ప్రదర్శించిన అదివో అల్లదివో కూచిపూడి శాస్త్రీయ నృత్యం నిర్వాహకుల ప్రశంసలు పొందింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన నాట్యరవళి అకాడమీ డైరెక్టర్ ఉమ్మిడి మహేష్‌బాబును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



నాట్యమయూరి అవార్డులు అందుకుంటున్న నాట్యరవళి అకాడమీ విద్యార్థులు



నృత్య ప్రదర్శన చేస్తున్న తగరపువలసకు చెందిన లిఖితసాయి